వ్యక్తి అదృశ్యం

మహమ్మద్ సాధిక్ (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ, మే 23: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శాంతినగర్‌లోని షీబలతా స్కూల్ ఎదురుగా నివాసముండే మహమ్మద్ సాధిక్ (42)కు పదహారేళ్ల క్రితం తరనమ్‌తో వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం. సాధిక్ ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. ఆన్‌లైన్ ఆర్డర్స్ డెలివరీ ఇవ్వాల్సి వస్తేనే అతడు బయటకు వెళ్లేవాడు. లేనిపక్షంలో ఇంట్లోనే ఉండేవాడు. ఈ నెల 16న సాయంత్రం తన మొబైల్ ఫోన్ చార్జింగ్ పెట్టాలని భార్యతో చెప్పి, ఇప్పుడే వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. సాధిక్ తిరిగి రాకపోవడంతో కంగారు పడిన తరనమ్ చుట్టపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. బంధువులు, సన్నిహితులతో వాకబు చేసినా అతడి ఆచూకీ తెలియరాలేదు. దాంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ మృతి

జి.వి.శ్రీనివాస్

బొల్లారం,మే 23:బొల్లారం డౌటన్ బజార్ శ్రీ హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ జి.వి.శ్రీనివాస్ ఆకస్మికంగా మృతి చెందారు. ఇంట్లో ఒక్కసారిగా కుప్ప కూలిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు.బీఆర్ఎస్ పార్టీలో కీలక ప్రాత పోషించిన శ్రీనివాస్ మృతి చెందడం బాధాకరమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

బస్ షెల్టర్ లేక.. అవస్థలు

సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖాన వద్ద బస్ షెల్టర్ లేకపోవడంతో బస్సుల కోసం ప్రయాణికులు ఎండలో రోడ్డుపై నిలబడి అవస్థలు పడుతున్నారు. ఓవైపు ఎండలు .., మరోవైపు నిలబడడానికి నీడ లేకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. ప్రతిరోజూ గాంధీ దవాఖానకు వేల సంఖ్యల్లో రోగులు వస్తుంటారు. అందులో చాలా మంది బస్సులోనే రాకపోకలు సాగిస్తుంటారు. మహిళలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, పిల్లలు ఎండలో ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఇక్కడ బస్ షెల్టర్ ఉండేది. రెండేండ్ల క్రితం మహాత్మా గాంధీ భారీ విగ్రహం ఏర్పాటు చేసిన హెచ్ఎండీఏ పరిసరాలను అభివృద్ధి చేయడంలో భాగంగా బస్ షెల్టర్‌ను తొలగించారు. నాటి నుంచి ప్రజలు షెల్టర్ లేకపోయినా రోడ్డుపైనే బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి సంబంధిత అధికారులు బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. – బన్సీలాల్‌పేట్

జీహెచ్ఎంసీలో మాదిరిగానే..

రానున్న వర్షాకాలంలో జీహెచ్ఎంసీలో మాదిరిగానే కంటోన్మెంట్ ప్రాంతంలో కూడా డిజాస్టర్ టీం లతో పాటు ప్రత్యేక చర్యలు చేపట్టాలని..కోరుతూ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు గురువారం బోర్డు కార్యాలయంలో సామాజిక వేత్త తేలుకుంట సతీష్ గుప్తా వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా కంటోన్మెంట్ లోని బస్తీ, కాలనీల్లో ఉన్న నాలాల్లో పూడిక తీత పనులను చేపట్టాలని, డ్రైనేజీ మురుగు నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని సీఈఓను సతీష్ గుప్త కోరారు. సానుకూలంగా స్పందించిన బోర్డు సీఈఓ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సతీష్ గుప్త వెల్లడించారు. – మారేడ్‌పల్లి

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, మే 23: డివిజన్ పరిధిలో పెండింగ్ ఉన్న అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. స్థానికంగా ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

మేడిబావిలో ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

రహదారిపై మురుగునీరు

సికింద్రాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మురుగు నీరు ఏరులై పారుతున్నది.దీంతో పాదచారులు ,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయంపై జలమండలి అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని బ్రాహ్మణబస్తీ,మేడిబావి,నామాలగుండు,ఉప్పరిబస్తీ తదితర ప్రాంతాల్లో మురుగు నీటి సమస్య ఎక్కువగా ఉన్నది. అధికారులు ,సిబ్బంది శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.– సికింద్రాబాద్

హైదరాబాద్ చాంప్ భవేష్ రెడ్డి జోడి విజయం

బహుమతులను అందుకుంటున్న భవేష రెడ్డి జోడీ

నేరేడ్‌మెట్, మే 23: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ నిర్వహించిన హైదరాబాద్ జిల్లా చాంపియన్‌షిప్ టోర్నీలో యువ షట్లర్లు భవేష్ రెడ్డి, సాయిష్ జోడి విజేతలుగా నిలిచారు. మే 20న మాదాపూర్‌లోని గేమ్‌పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమిలో అండర్ 13, 15, 17, 19 ఓపెన్ టోర్నీలు నిర్వహించారు. అండర్ 13 బాలుర డబుల్స్ ఫైనల్‌ల్లో భవేష్ రెడ్డి, సాయిష్ ద్వయం 21-14, 21- 19 తో దర్శ్ గోయల్, ధ్రువ్ సింగ్ జంటపై అద్భుత విజయం సాధించారు. టైటిల్ విజయంలో రాష్ట్ర టోర్నీలకు అర్హతసాధించారు. అంతకుముందు అండర్ 13 విభాగంలో క్రిషవ్ ద్వయం 21-10,21-16తో భవేష్ రెడ్డిపై అద్భుత విజయం సాధించడంతో భవేష్ సిల్వర్ మెడల్‌ను సరిపెట్టుకున్నాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ వర్మమాన మహిళా బాక్సర్ నిఖత్ జరీన్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరినాథ్, బ్యాట్ జాయింట్ సెక్రటరీ యూవీఎన్ బాబు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కోశాధికారి కే. వంశీధర్, బ్యాట్ ఆఫీస్ సెక్రటరీ పీవీఎల్ కుమార్, శారద తదితరులు హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు.

సికింద్రాబాద్‌లోని మహేంద్రాహిల్స్‌లో ఉన్న బుద్ధ ఆలయంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. గురువారం బుద్ధ పౌర్ణమి సందర్భంగా జంట నగర వాసులు ఆలయానికి తరలివచ్చి బుద్ధుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

వెస్ట్ బెంగాల్ హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

గోల్నాక: వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన రిజర్వేషన్లను రద్దు చేస్తూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును బీజేపీ స్వాగతిస్తోందని బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు.
వెస్ట్ బెంగాల్ తీర్పును స్వాగతిస్తూ గురువారం రాష్ట్ర బీజే పీ ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వెస్ట్ బెంగాల్‌లోని తృణమాల్ కాంగ్రెస్ ప్రభుత్వం 77 ముస్లిం వర్గాలను ఓబీసీలో చేర్చడాన్ని అక్కడి ఉన్నత న్యాయం స్థానం తప్పుపట్టిందన్నారు.

చండీ యాగం

పౌర్ణమిని పురస్కరించుకొని సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో గురువారం చండీ యాగం నిర్వహించారు. ఈ హోమంలో దాదాపు 160 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి జరిగిన విశేష పూజల్లో భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. – బేగంపేట్

వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలోని శ్రీ దుర్గామాత, జ్ఞాన సరస్వతి దేవి అమ్మవార్లకు ఆలయంలో విశేష పూజలు, హోమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – అమీర్‌పేట్

అన్నదానం: కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం డౌటన్ బజార్ భూలక్ష్మి దేవాలయంలో గురువారం పౌర్ణమి దినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహన్,అర్వింద్ అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. – బొల్లారం,మే 23:

అడిక్‌మెట్

జేబీఎస్ పరిధిలో..

పోయేదెట్ల..! నగర రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు. ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సికింద్రాబాద్‌లోని అడిక్‌మెట్, జూబ్లీ బస్‌స్టేషన్ పరిధిలో కంకర తేలిన రోడ్లు దర్శనమిస్తున్నాయి.ఈ విధంగా ఉంటే పోయేదెట్ల అని అటునుంచి పోయే వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం ఇప్పటికైనాస్పందించి సమస్యను గుర్తించి త్వరగా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

బెటర్ ట్రాజెక్టరీస్ గ్రంథావిష్కరణ

ముషీరాబాద్, మే 23: చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గురువారం రచయిత అంజన గోలి రచించిన బెటర్ ట్రాజెక్టరీస్ గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్యావదాని శంకర నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆమెరికాలో సేవా కార్యక్రమాల నిర్వహణతోపాటు వ్యక్తిత్వ వికాస వ్యాస రచన, సాహిత్య రంగాల్లో రాణిస్తున్న అంజన గోలి ప్రశంసనీయురాలని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, రాయారావు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లులేని నిరుపేద దళితులకు స్థలాలివ్వాలి

హిమాయత్‌నగర్, మే 23: రాష్ట్రంలో ఇండ్లులేని నిరుపేద దళితులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ జూన్ 10న అన్ని జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 18 నుంచి 20 వరకు భువనగిరి యాదాద్రి జిల్లాలో డీహెచ్‌పీఎస్ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు డీహెచ్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

మల్కాజిగిరి, మే 23: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకొని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ కథనం ప్రకారం... మచ్చ బొల్లారం సాయి రెసిడెన్సీకి చెందిన రాణాప్రతాప్ సింగ్(33) సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై ఉద్యోగానికి వెళ్లడం మానేశాడు. ఇతనికి భార్య, బాబు ఉన్నారు. వారం క్రితం వేసవి సెలవులకు భార్యతో పాటు బాబు నాందేడ్‌కు వెళ్లారు. మద్యానికి బానిసైన రాణాప్రతాప్‌సింగ్ మానసింకంగా ఆవేదన చెందుతున్నాడు. మానసిక ఒత్తిడితో మంగళవారం తన ప్లాట్‌లో మద్యం తాగి మత్తులో నీళ్లలో బ్లీచింగ్ ఫౌడర్ కలుపుకుని తాగాడు. తర్వాత అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న బంధువుల వద్దకు వెళ్లి వాంతులు, వీరోచనాలు చేసుకున్నాడు. బంధువులు ఏమైయిందని ప్రశ్నించడంతో నీళ్లలో బ్లీచింగ్ ఫౌడర్ కలుపుకుని తాగానని తెలిపాడు. వెంటనే వారు చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి సమీర్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కాచిగూడలో ఉచిత వైద్యశిబిరం

కాచిగూడ : శ్రీ శ్యామ్‌మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో కాచిగూడ శ్రీ శ్యామ్‌బాబా మందిర్‌లో ఈ నెల 24 నుంచి 31 వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆధునిక పరికరాలతో పక్షవాతంతో బాధపడేవారికి ఫిజియోథెరిపీతో పాటు కిట్స్ ఉచితంగా అందిస్తున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్ రావు తెలిపారు. పూర్తి వివరాలకు 99492 38492 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వృత్తి సంఘాల నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుదర్శన్‌రావు

చిక్కడపల్లి, మే 23 : స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్‌లో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేసి బీసీల అన్ని తరగతులకు రిజర్వేషన్లు అందించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వివిధ వృత్తి సంఘాల ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్‌లో ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, ప్రొఫెసర్ భాగయ్య తదితరులు హాజరై మాట్లాడారు. మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోరిగల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు విగ్నేశ్, వెంకటకృష్ణ, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కుమారస్వామి, బోయ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మీనంగిరి గోపి, సుధాకర్, జంపాల రాజేశ్, బాలరాజు, ఏఎల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ పెద్దపీట

కవాడిగూడ, మే 23 : ఆలయాల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభు త్వం పెద్దపీట వేసిందని ఆ పార్టీ యువ జన నాయకుడు ముఠా జయసింహ అన్నారు. గురువారం కవాడిగూడలోని ఉన్నికోట దేవాలయ అభివృద్ధికి ముషీ రాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పంపించిన లక్ష రూపాయల చెక్కును ఆయన ఉన్నికోట బస్తీ వాసులకు అందజేశారు. ఉన్నికోట ఆలయ అభివృద్ధికి బస్తీవాసుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే లక్ష రూపాయలు సహాయంగా ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, బస్తీ వాసులు వల్లాల రవియాదవ్, ముద్దం శివగౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష రూపాయల చెక్కును బస్తీవాసులకు అందజేస్తున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ

PUBLIC NOTICE

The general public are hereby informed that Mr. Poli Sudarshan Reddy S/o. Mr. Poli Ramakrishna Reddy is proposing to mortgage the below mentioned property in favor of my client M/s. Axis Bank Ltd. having its office at Ranigunj, Hyderabad. That the said mortgager states that, the original link document pertaining to the property bearing Registered sale deed No. 497/2015 dated 29.01.2015 was misplaced by his vendor and the original of the same is not available for custody of the bank. It is further represented that, the schedule property is not subjected to any encumbrances, mortgages, third party claims (or) private sales, etc. This notice is caused calling for any claims, objections whatsoever. In the event of any such claim/objection etc., they may contact the undersigned in the below mentioned address with all relevant documents within 7 days from the date of publication of this notice. In case, no objections are received, my client will proceed further and accept the mortgage, treating that no claims, objections or disputes on the said property. The claims thereafter if any, shall not be entertained.

SCHEDULE OF PROPERTY

All that the Plot No.96, admeasuring 1021.60 Sq. Yards in Padmapuri Town Ship Layout approved (L.P.No.62/G1/2013 (Roc.No.2017/G1 (2013) dated 19.11.2013) in Sy. No.361/2A, Sy. No. 362 and after sub Division Sy. No.362/A1, Sy. No.362/A2, Sy.No.362/B1, Sy. No.362/B2, Sy. No.365/1A, Sy. No.365/1B, Sy. No.365/1C and Sy. No.365/3RU and after sub division Sy. No.365/3A1, Sy. No.365/3A2, Sy. No.365/3A3, Sy. No.365/3B2 and Sy. No.366/1, Sy. No. 366/3B, Sy. No.367/1A/1, Sy. No.367/1A2 situated at Tandlam Village, Renigunta, Chittoor District and bounded by:- **North:** Plot No. 95, **South:** Plot No. 97, **East:** 150 feet master plan road, **West:** Plot Nos. 106 & 107

Sd/- **K. RAJA GOPAL REDDY**
& Associate Advocates
Flat No. 105, Sai Swaroop Apartments, Lane beside to Hotel Central Park, Hyderguda, Hyderabad -29.
Ph: 040-23210728,9866313940